క్లుప్తంగా

ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ



మల్దకల్: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో సోమవారం ఇన్చార్జి ఎంఈఓ సురేష్ మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులకు ఉచిత పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉచిత పాఠ్య పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గద్వాల ఆర్డీఓగా అలివేలు

గద్వాల: గద్వాల నూతన ఆర్డీఓగా ఎల్.అలివేలుగా బదిలీపై వచ్చారు. సోమవారం కలెక్టరేట్లో అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. వరంగల్ గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్లో డిప్యూటీ కలెక్టర్గా పనిచేస్తూ బదిలీపై గద్వాల ఆర్డీఓగా వచ్చారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



గద్వాలన్యూటౌన్: నెల రోజులపాటు నిర్వహించిన ఉచిత వేసవి కబడ్డీ శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. సోమవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో ముగింపు వేడుకల సమావేశం నిర్వహించారు. వేడుకలకు అతిథిగా హాజరైన డీవైఎస్ఓ జితేందర్ మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక ధారుడ్యాన్ని, మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. ప్రతి కీడాకారుడు క్రమశిక్షణను అలవర్చుకొని, లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. అనంతరం దౌదర్పల్లికి చెందిన మధు 40మంది క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కబడ్డీ ట్రైనర్ రజనీకాంత్, సీనియరల్ క్రీడాకారులు తిరుపతి, డ్యాంకృష్ణ, షెక్షావలి, పురేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల నమోదు

ధరూరు:వాహన తనిఖీల్లో భాగంగా సోమవారం మండల పరిధిలోని చింతరేవులలో నిర్వహించిన తనిఖీల్లో డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు. మక్తల్, నారాయణపేట, డ్యాం వైపు వెళ్లే రోడ్డులో వాహనాల తనిఖీ చేశారు. వాహనదారులు, ప్రజలు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు



అలంపూర్: రైతులకు అందించిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని మహబుబ్నగర్ డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్రెడ్డి అన్నారు. అలంపూర్ పట్టణంలోని బీఆర్ఎస్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన అలంపూర్ పీఏసీఎస్ సొసైటీ కార్యదర్శి కేశవరెడ్డి పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. డీసీసీబీ బ్యాంక్ డైరెక్టర్ రంగారెడ్డితో కలిసి కేశవరెడ్డి దంపతులను సత్కరించారు. సొసైటీ కార్యదర్శిగా శ్రీనివాసులు నూతనంగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు అధ్యక్షుడు మోహన్రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, పీఏసీస్ డైరెక్టర్లు, బ్యాంక్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్ల పనితీరు మారాలి

అయిజ: కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకోసం ఎన్నో పథకాలు ప్రవేశపెడుతుంటే బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యం వలన అర్హులకు లబ్ధిచేకూరకుండా పోతుందని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్బీఐ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ మంచి సంకల్పంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీఎం విశ్వకర్మ పథకం 18 రకాల కులవృత్తుల వారికి లబ్ధిచేకూరుస్తుందన్నారు. అయితే బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యం వలన లబ్ధిదారులు అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. శిక్షణ ఇచ్చిన లబ్ధిదారుల జాబితాను కనీసం జిల్లా కేంద్రం నుంచి స్థానిక బ్రాంచ్లకు పంపకపోవడం శోచనీయమన్నారు. లబ్ధిదారులకు అన్యాయం జరిగితే నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భీమ్సేనరావు తదితరులు పాల్గొన్నారు.



గద్వాలలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు



అలంపూర్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకట్రామయ్యశెట్టి



అలంపూర్లో కోర్టులో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జడ్జి పూజిత



గట్టులో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ మదన్మోహన్గౌడ్



మల్దకల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట జెండా ఆవిష్కరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ ఝాన్సీరాణి

ఊరూవాడ అవతరణ వేడుకలు

సాక్షి నెట్వర్క్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా వ్యాప్తంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, కోర్టు ఆవరణలు, పోలీసు స్టేషన్లు, వివిధ రాజకీయ పార్టీల కార్యాలయాల్లో జాతీయ పతకాన్ని ఆవిష్కరించి సంబరాలు చేసుకున్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో కలకలలాడాలని వక్తలు, రాజకీయ నాయకులు ఆకాక్షించారు. జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్రెడ్డి తన క్యాంప్ కార్యాలయంలో, అలంపూర్ పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో గద్వాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పూజిత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్రావు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. పలుచోట్ల తెలంగాణ అమరవీరుల చిత్రపటాలకు, స్థూపాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పద్మావతి, ఎంపీడీఓ తిరుపతన్న, ఎంపీడీఓ మంజుల, ఎంపీడీఓ చెన్నయ్య, ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్ సయ్యద్ఖాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రామన్గౌడ్, జెడ్పీ మాజీ చైర్పర్సన్ సరిత, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకట్రామయ్య శెట్టి, వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ దొడ్డెన్న, సీఐ హనుమానాయక్, ఎస్ఐ మహేష్, స్పెషల్ ఆఫీసర్ రామలింగేశ్వర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ సైదులు, పీఏసీఎస్ ప్రెసిడెంట్ మధుసూదన్రెడ్డి, తహసీల్దార్ నరేందర్, తహసీల్దార్ మదన్మోహన్గౌడు, ఎంఈఓ రవీంద్రబాబు, ఎంపీఓ అజార్ మొహియుద్దీన్, తహసీల్దార్ వీరభద్రప్ప, తహసీల్దార్ హరికృష్ణ, ఎస్ఐ శ్రీనివాసులు, సింగిల్విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, ఎంపీఓ రాజశేఖర్, బీఆర్ఎస్ నాయకుడు బాసు హనుమంతు, పంచాయతీ కార్యదర్శులు, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అధికారులు, నాయకులు



గద్వాలలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్రెడ్డి, నాయకులు



కేటీదొడ్డి తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించిన అధికారులు



ధరూరు తహసీల్దార్ కార్యాలయంలో వేడుకల్లో పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు



మానవపాడులో రాష్ట్ర అవతరణ వేడుకల్లో అధికారులు, గ్రామస్తులు



శాంతినగర్లో అమరవీరులకు నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాసంఘాల నాయకులు



రాజోళి పోలీస్ స్టేషన్లో జెండావిష్కరణ చేస్తున్న ఎస్ఐ జగదీశ్



ఇటిక్యాలలో పతాకావిష్కరణ చేస్తున్న అధికారులు



ఎర్రవల్లిలో పతాకావిష్కరణ చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ రంగారెడ్డి

నాణ్యమైన విత్తనాలతో సాగు చేపట్టాలి



వరి విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: రైతులు నాణ్యమైన విత్తనాలతో పంటను లాభసాటిగా మార్చుకోవాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో గ్రామ గ్రామాన నాణ్యమైన విత్తనం.. లాభసాటి వ్యవసాయానికి సోపానం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అధిక దిగుబడి కోసం ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన ఆర్ఎన్ఆర్(15048) రకం విత్తనాలు రైతులకు పంపిణీ చేశారు. అలంపూర్, ఉండవెల్లి మండలాలకు చెందిన రైతులకు 10 కిలోల వరి విత్తనాలను పాలెం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం శంకర్, డాక్టర్ ఏ శంకర్తో కలిసి అందజేశారు. విత్తనాలు కొనుగోలు చేస్తే తప్పక రశీదు పొందాలన్నారు. పంట సాగులో వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



అయిజలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

అయిజ: ప్లాస్టిక్ వస్తువులు ఉపయోగించడం వలన పర్యావరణం పూర్తిగా దెబ్బతింటుందని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకుందామని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు అన్నారు. సోమవారం మున్సిపాలిటీలోని ప్రధాన రోడ్లపై పర్యావరణానికి సంబంధించిన బ్యానర్, ప్లకార్డులతో మున్సిపల్ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సంర్భంగా కమిషనర్ మాట్లాడారు. ప్లాస్టిక్ కవర్లను ప్రభుత్వం నిషేధించందని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను ఉపయోగించిన వారికి జరిమాన విధించడంతోపాటు చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోండి

మానవపాడు/అయిజ/ఉండవెల్లి/రాజోళి/ధరూరు/ఎర్రవల్లి: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జోషి శ్రీనివాస్శర్మ సోమవారం తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఈ నెల 3వ నుంచి 20వ తేదీ వరకు ఆయా గ్రామాల వారీగా దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

❖ అయిజ మండంలోని వివిధ గ్రామాల్లో ఈనెల 3 నుంచి 16వ తేదీ మండలంలోని వివిధ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు.

❖ ఉండవెల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రభాకర్ తెలిపారు. మంగళవారం మెన్నిపాడు, చిన్న ఆముదాలపాడు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు.

❖ రాజోళి మండలంలోని అన్ని గ్రామాల్లో భూభారతి రెవెనూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పి.రామ్మోహన్ తెలిపారు. సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

❖ దరూరు మండలంలో 3వ తేదీ నుంచి నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నరేందర్ కోరారు. రెండు బృందాలుగా ఏర్పడి మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం మన్నాపురం, నీలహళ్లి గ్రామాల్లో సదస్సులు ప్రారంభమవుతాయన్నారు.

❖ ఎర్రవల్లి మండలంలోని గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దార్ నరేష్ తెలిపారు. రైతుల నుంచి భూ సమస్యలపై అర్జీలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు సదస్సులను సద్వినియోగించుకోవాలని సూచించారు.

మానసిక ప్రశాంతతకు యోగా దోహదం



యోగాపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఇటిక్యాల: మానసిక ప్రశాంతత పెంచేందుకు యోగా దోహదపడుతుందని ఆయుష్ మండల వైద్యాధికారి ముబీనా తబసుమ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో యోగా దశాబ్ది ఉత్సావాల్లో భాగంగా రాష్ట్ర ఆయుష్ విభాగం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న యోగా మాసోత్సవాల్లో భాగంగా 6వ రోజు ప్రజలకు యోగా డైట్ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. నిత్యం యోగా సాధన చేయడం వలన మానసిక, ఆరోగ్యంతో పాటు ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఆయుష్ సేవాలను మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయుష్ శాఖ నేతృత్వంలో ప్రజా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నరేష్, శివాని, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

మానవపాడు: జాతీయ రహదారిపై బైక్ను ఢీకొట్టిన కారు డ్రైవర్పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రకాంత్ సోమవారం తెలిపారు. జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా బైక్ను కారు ఢీకొట్టిన ప్రమాదంలో బైక్పై ఉన్న ఈరన్న గాయపడిన విషయం విధితమే.. ఈ క్రమంలో ఈరన్న భార్య సత్యమ్మ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసలు



అయిజ: హైదరాబాద్లోని ఘట్కేసర్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరిచిన అయిజ మండల విద్యార్థులను సోమవారం మాస్టర్లు శేక్షావలి ఆచారి, సుధీర్ కుమార్, ప్రదీప్సాగర్, నవదీప్సాగర్, వెంకటేష్ ప్రశంసించారు. విద్యార్థులు సాయి, కావ్య, కోమలి బంగారు పతకాలు, ఉషశ్రీ వెండి పతకం, లాస్యప్రియ, తిరుమలేష్, దుర్వేశ్, ఋషికుమార్ కాంస్యం పథకాలు సాధించినట్లు మాస్టర్లు తెలిపారు. పంజాబ్లోని హరిద్వార్లో త్వరలో నిర్వహించనున్న జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో వీరు పాల్గొనున్నట్లు పేర్కొన్నారు.

నాయకులే దారి తప్పితే ఎలా..?



మాట్లాడుతున్న నాయకులు



పూజలు చేస్తున్న ఎంపీ మల్లు రవి

అలంపూర్: నాయకులే దారి తప్పితే ఎలా అని అలంపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ దొడ్డెన్న, వైస్ చైర్మన్ పచ్చర్లకుమార్ ప్రశ్నించారు. అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. నాగర్కర్నూల్ ఎంపీ మల్లు రవి రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు జిల్లా కేంద్రానికి వచ్చారని, ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎంపీ అలంపూర్ ఎమ్మెల్యే విజయుడుతో కలిసి వేదిక పంచుకోవడంలో ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. కానీ అనంతరం గద్వాల నియోజకవర్గ ఇన్చార్జ్ ఇంటికి మల్లు రవి ఎమ్మెల్యేను తీసుకెళ్లినట్లు తెలిపారు. అక్కడ ఎమ్మెల్యేను సత్కరించడాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్గా పదవిలోకి వచ్చిన రెండో రోజే ఆయన క్రమశిక్షణ తప్పారని ఆరోపించారు. సీఎం రేవంత్రెడ్డి నేతృత్వంలో అలంపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పదేళ్లపాటు బీఆర్ఎస్పై పోరాటం చేశారన్నారు. వారి పోరాట ఫలితంగానే ప్రజలు ఆశీర్వదించడంతో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కానీ నాగర్కర్నూల్ ఎంపీ మల్లు రవి కష్టపడిన కాంగ్రెస్ కార్యకర్తలను కాదని బీఆర్ఎస్ బడా కాంట్రాక్టర్లతో కుమ్మక్కయారని ఆరోపించారు. కమీషన్తో రూ.10 కోట్ల పనులు బీఆర్ఎస్ నాయకులకు అప్పగించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని ఆరోపించారు. ఎంపీపై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. క్రమశిక్షణ కమిటీ చైర్మన్గా అలంపూర్ క్షేత్రానికి వస్తున్నారనే సమాచారంతో ఘనంగా స్వాగతం పలకడానికి ఏర్పాట్లు చేశామని, కానీ ఈ సంఘటనతో మనస్తాపం చెంది ఆయన వెంట వెళ్లడాన్ని బహిష్కరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గోపాల్, రాము, జగన్మోహన్ నాయుడు, జయన్న, వెంకటేష్యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి వ్యతిరేకంగా ఆలోచనే ఉండదు..

పార్టీకి వ్యతిరేకంగా ఆలోచన చేసే మాటే ఉండదని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి అన్నారు. అలంపూర్ క్షేత్ర ఆలయాలను దర్శించుకొని అనంతరం విలేకర్లతో మాట్లాడారు. పార్లమెంట్ సభ్యుడిగా ఉండటంతో రాష్ట్రంతోపాటు కేంద్ర నిధులు అలంపూర్ క్షేత్రానికి తీసుకరావడానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఒకే వేదికపై కూర్చున్న సమయంలో ఎంపీగా ఎమ్మెల్యేతో మాట్లాడటం సహజమన్నారు. పార్టీ వేరు పదవులు వేరన్నారు. కాంగ్రెస్కు వ్యతిరేకంగా ఆలోచన చేసే విధానం తనకు లేదని భవిష్యత్తులో అది రాదని స్పష్టం చేశారు.

వివాదాస్పదంగా పైపులైన్ నిర్మాణం

- రిజర్వాయర్ కట్ట తెగకుండా ఏర్పాటంటూ ఓ వర్గం
- రిజర్వాయర్లో నీళ్లు ఉండకుండా కుట్రని మరో వర్గం



చిన్నోనిపల్లె రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేస్తున్న పైపులు

గట్టు: చిన్నోనిపల్లె రిజర్వాయర్ వద్ద పెద్ద పైపులైన్ ఏర్పాటు వ్యవహారం వివాదాస్పదంగా మారింది. గతేడాది చిన్నోనిపల్లె రిజర్వాయర్ గండిని పోలీస్ బందోబస్తుతో పూడ్చిన అనంతరం రిజర్వాయర్ నీటి మట్టం పెరిగి, నీరు గ్రామంలోకి చేరుకోవడంతో గ్రామస్తులు ఆఘమేఘాల మీద కట్టుబట్టలతో ఖాళీ చేయాల్సి వచ్చింది. రిజర్వాయర్లో నీటి మట్టం పెరగకుండా, గ్రామం నీటిలో మునగకుండా రిజర్వాయర్ కట్ట వెంట సమాంతర కాల్వను తవ్వి, అదనంగా వచ్చే నీటిని రిజర్వాయర్ బయటకు వెళ్లే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ సమాంతర కాల్వను ఏర్పాటు చేయకపోతే రిజర్వాయర్ కట్ట తెగిపోయే ప్రమాదం పొంచి ఉండేది. అయితే ఏడాది తర్వాత కాల్వలో పెద్ద సైజు పైపులను వేసి, పూడ్చి వేస్తున్న వ్యవహారంపై సామాజిక మాధ్యమాల్లో చిన్నోనిపల్లె రిజర్వాయర్పై కుట్రలు చేస్తున్నారని, రిజర్వాయర్లోని మొత్తం నీటిని రిజర్వాయర్ కిందకు వెళ్లే విధంగా కుట్రలు చేస్తున్నట్లు పోస్టులు వైరల్ అయ్యాయి. మరో వైపు గతేడాది ఏర్పాటు చేసిన కాల్వ ప్రస్తుతం పూడుకు పోయిందని, కాల్వ తవ్విన కారణంగా చిన్నోనిపల్లె నుంచి బోయలగూడెం గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందికరంగా మారిన తరుణంలో అక్కడ పైపులను ఏర్పాటు చేసి, రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నారని, గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా అదే స్థాయిలో 1 టీఎంసీ నీటి నిల్వ ఉంటుందని మరో వర్గం వారు చెబుతున్నారు. ఇలా రిజర్వాయర్ దగ్గర చేపట్టిన పనులపై రెండు వర్గాల వారు విభిన్నరీతిలో సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్న తరుణంలో వివాదం నెలకొంది. ఈ క్రమంలో పైపులైన్ ఏర్పాటుపై అధికారులు వివరణ ఇచ్చారు.చిన్నోనిపల్లె రిజర్వాయర్ దగ్గర ఏర్పాటు చేస్తున్న పైపులైన్ విషయంలో ఎస్ఈ రహీముద్దీన్ను వివరణ కోరగా, చిన్నోనిపల్లె నుంచి బోయల గూడెంతో పాటుగా రిజర్వాయర్కు అటువైపు ఉన్న గ్రామాలకు వెళ్లడానికి ఇబ్బందికరంగా ఉన్న తరుణంలో గ్రామస్తులే పైపులను వేసుకుంటున్న విషయం మా దృష్టికి వచ్చిందన్నారు. రిజర్వాయర్లో గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా 1 టీఎంసీ నీరు నిల్వ ఉంటుంది. అంతకు మించి వచ్చే నీరు మాత్రమే బయటకు పోవడానికి పైపులైన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఏడాదైన షిఫ్టింగ్ చార్జీలు ఇవ్వలే..

చిన్నోనిపల్లె గ్రామస్తుల్లో ఇప్పటి వరకు కొందరికి షిఫ్టింగ్ చార్జీలు చెల్లింకపోవడంతో కొందరు పాత గ్రామంలోనే నివాసం ఉంటున్నారు. ఏడాది క్రితం చిన్నోనిపల్లె రిజర్వాయర్లో నీటిమట్టం పెరగడంతో గ్రామస్తులు గ్రామాన్ని ఖాళీ చేసి, పునరావాస కేంద్రంలోకి మారారు. అలా మారిన వారికి ప్రభుత్వం షిఫ్టింగ్ చార్జీలు చెల్లించింది. 251 కుటుంబాలకు గాను పునరావాస కేంద్రంలో 360 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. అయితే ఇప్పటికి 40 కుటుంబాలకు పైగా షిఫ్టింగ్ చార్జీలు చెల్లించలేదని ఈ సందర్భంగా నిర్వాసిత కుటుంబాల వారు వాపోయారు.